క్లుప్తంగా

నేడు పెద్దారవీడులో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, తొలుత సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను ప్రారంభించిన అనంతరం గడప గడపకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు. అధికారులతోపాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వరిలో కాలిబాటలతో ఎంతో మేలు

దర్శి: వరి నారు నాటేటప్పుడు కాలిబాటలు తీయాలని పొలంబడి క్లస్టర్ మానిటరింగ్ ఆఫీసర్, ఏడీఏ ఎం.ప్రభాకర్‌రావు తెలిపారు. మండలంలోని బొట్లపాలెం గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరినారుమడిలో యాజమాన్యం, నారుకొనలను తుంచడం, వాటి ప్రాధాన్యత గురించి రైతులకు తెలియజేశారు. వ్యవసాయాధికారులు సుచరిత, స్వర్ణలత, బాలకృష్ణనాయక్, వీఏఏ మాసుమ్‌బాజీ, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దర్శి: మండలంలోని బొట్లపాలెం పొలాల్లో పేకాట శిబిరంపై ఎస్సై రామకృష్ణ శుక్రవారం సిబ్బందితో దాడిచేశారు. 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.30.520 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వారిని దర్శి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీ చింతలపాలెం ఎంపీపీఎస్ పాఠశాలను ఎంఈవో జి.సుబ్బయ్య శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రార్థన, పాఠ్య ప్రణాళికలు, రికార్డులు, విద్యార్థుల వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం చంద్రిక, సీఆర్పీ మారుతి, పరిశీలన హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి

మార్కాపురం: మార్కాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పొదిలి తహసీల్దార్ భాగ్యలక్ష్మిని నియమిస్తూ శుక్రవారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వరి గడ్డి దగ్ధం

తాళ్లూరు: మండలంలోని మాధవరంలో ప్రమాదవశాత్తూ శుక్రవారం రెండు వరి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు జింకల మునలారెడ్డి, నుసుం నాగిరెడ్డికి చెందిన రూ.1.50 లక్షల విలువైన 8 ట్రక్కుల వరి గడ్డి ప్రమాదంలో దగ్ధమైంది. సమాచారం అందుకున్న దర్శి అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు



కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కార్మికులు

దర్శి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఎమ్మిగనూరు వెళ్లిన మంజునాథ్‌గౌడ్‌ను మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం గుజ్జుల సరళాదేవి భవన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ఇర్మియ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు జిరాక్స్ యంత్రం అందజేత

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గడికోట గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు సారె శివ తన సొంత నగదుతో జెరాక్స్ కం ప్రింటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి సర్పంచ్ సారె శివను ఘనంగా సన్మానించారు.

చెరకులో సస్యరక్షణ చేపట్టాలి

తాళ్లూరు: చెరకు సాగులో రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. నాగంబొట్లపాలెంలో సాగుచేసిన చెరకును శుక్రవారం ఆయన పరిశీలించారు. చెరకులో ఆశించిన పీక పురుగు గురించి రైతు నాగిరెడ్డి వ్యవసాయాధికారి దృష్టికి తీసుకురాగా సస్యరక్షణ చర్యలను వివరించారు. వీఏఏ శ్రీను, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ మాధవరావు, పక్కన డీఎం



పొదిలి డిపోలో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

● ఎంవీఐ మాధవరావు

మార్కాపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని మార్కాపురం ఎంవీఐ మాధవరావు, పట్టణ ఎస్సై శశికుమార్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత వారోత్సవాల ప్రారంభానికి ఆర్టీసీ డీఎం ఎఎస్ నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపవద్దని తెలిపారు. డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

పొదిలి రూరల్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమనే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు బాధ్యతతో వాహనాలు నడపాలని పొదిలి సీఐ కె.సుధాకర్ సూచించారు. శుక్రవారం పొదిలి ఆర్టీసీ డిపోలో జరిగిన 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో సీఐ మాట్లాడారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఓర్పు, ఏకాగ్రతతో ఉండాలన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్

యర్రగొండపాలెం: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో నీటి ఎద్దడి సమస్య జఠిలం కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎండాకాలంలో ఆ సమస్య మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు నీటి లభ్యత ప్రాంతాలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లాలని చెప్పారు. సమీక్ష సందర్భంగా తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థలాలు కొనుగోలు చేసే ముందు వీఆర్వోలను సంప్రదించి లేఔట్ వివరాలు తెలుసుకోవాలని సూచించారు. సొంత స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపడితే పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తామని, తద్వారా హౌసింగ్ అధికారులు నిధులు మంజూరు చేస్తారన్నారు. సమావేశానికి ముందుగా మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్.మౌలాలి మృతికి సంతాపం తెలిపారు. వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు, ఏవో వెంకటేశ్వర్లు, హెచ్ఓ పి.ఆదిరెడ్డి, ఏఈలు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఎంఈవో ఆంజనేయులు, ప్రభుత్వ వైద్యాధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రధాని పరీక్ష పే చర్చ విద్యార్థులకు స్ఫూర్తిదాయకం



జూనియర్ కళాశాల నుంచి పరీక్ష పే చర్చలో పాల్గొన్న విద్యార్థులు

త్రిపురాంతకం: పరీక్షల్లో ఒత్తిడికి లోనవకుండా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని పరీక్షా పే చర్చ కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జి కె.పిచ్చయ్య పేర్కొన్నారు. త్రిపురాంతకం ప్రభుత్వం జూనియర్ కళాశాల, భారతీ స్కూల్, బాలవిహార్ స్కూళ్లలో పరీక్ష పే చర్చపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

దొనకొండ: గ్రామాల్లోని సమస్యలపై ప్రజలు వచ్చినప్పుడు అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులకు జవాబుదారీతనం లేకుంటే సమస్యలు ఎక్కడివక్కడే మిగిలిపోతాయన్నారు. అలా జరిగితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి అన్ని వర్గాల వారిని సమానంగా చూసుకుంటూ సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్నారన్నారు. వచ్చేది వేసవి కావడంతో అధికారులు గ్రామాల్లో ప్రజలకు పుష్కలంగా నీరందించేందుకు ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సమావేశానికి విద్యుత్, ఇరిగేషన్ అధికారులు గైర్హాజరయ్యారని, వారికి వెంటనే మెమో తయారు చేయాలని ఎంపీడీవో వి.వసంతరావునాయక్‌కు ఎంపీపీ సూచించారు. మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వేసిన పంటలకు ఆర్‌బీకే సిబ్బంది 90 శాతం ఈ క్రాప్ చేశారని, ఈ నెల 31వ తేదీ వరకు ఈ క్రాప్‌నకు గడువుందని, చేయించుకోని వారు తప్పనిసరిగా ఆర్‌బీకేకు వెళ్లి సిబ్బందిని సంప్రదించాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ 108, 104 అందుబాటులో ఉంటాయని వైద్యాధికారి ఎం.సునీత తెలిపారు. ప్రజలు వైద్యానికి ఎక్కువ భాగం ఆర్ఎంపీలను సంప్రదిస్తున్నారని, వారు ఇష్టమొచ్చినట్లు వైద్యం చేసి రోగులను ఇబ్బంది పెడుతున్నారని, త్వరలో పరిశీలించి అర్హత లేని వారిని సీజ్ చేస్తామని వైద్యాధికారి హెచ్చరించారు. కొచ్చెర్లకోట పంచాయతీ సిద్ధాయపాలెంలో పైపులైన్ లేని కారణంగా నీటికి ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని ఎంపీటీసీ ఆంటోనిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఏఈ రామాంజనేయులు పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. మండలంలో 13,480 రేషన్ కార్డులు ఉన్నాయని, నూతన కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.సాంబశివరావు, ఈవోఆర్డీ ఎస్.డేవిడ్, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జాన్‌మార్క్, కోఆప్షన్ షేక్ గఫార్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రామ్‌నాథ్

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఏ1 గ్లోబల్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రావు, ట్రైనర్ ఎం.రామనాథ్ సూచించారు. శుక్రవారం బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ఏఐ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

పెన్షనర్ల భవనానికి మైక్ బహూకరణ



పెన్షనర్లకు మైక్ బహూకరిస్తున్న శేఖర్‌బాబు

పొదిలి రూరల్: పొదిలి తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి గుంటూరి వీరబ్రహ్మం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శేఖర్ బాబు పొదిలి పెన్షనర్ల భవనానికి రూ.20 వేల విలువైన మైక్‌సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా దాతను పెన్షనర్లు సత్కరించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, బాదుల్లా, మదర్‌వలి, సుబ్బారావు, శ్రీహరి, జానీ, గోవిందయ్య, దుర్గమ్మ, కృపానందం, ఇస్మాయల్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి వాటర్ ట్యాంక్ బహూకరణ



హాస్టల్‌కు వాటర్ ట్యాంక్ అందజేస్తున్న జెడ్పీటీసీ రత్నరాజు

ముండ్లమూరు: మండలంలోని మారెళ్లలో గల ప్రభుత్వ బాలుర వసతి గృహానికి వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును జెడ్పీటీసీ, జిల్లా సోషల్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు తాతపూడి రత్నరాజు శుక్రవారం హాస్టల్ వార్డెన్‌కు అందజేశారు. హాస్టల్ విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతుండగా సోషల్ వెల్ఫేర్ అధికారి సమస్యను జెడ్పీటీసీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన రత్నరాజు తన సొంత నిధులతో వాటర్ ట్యాంక్ కొనుగోలు చేసి శుక్రవారం హాస్టల్ వార్డెన్ భూమా నరసింహారావుకు అందజేశారు. దీంతో హాస్టల్ విద్యార్థులకు తాగునీటి సమస్య తీరనుంది. సమస్య తన దృష్టికి రాగానే స్పందించి వాటర్ ట్యాంక్ బహూకరించిన రత్నరాజుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పొదిలి ఆర్టీసీ డిపోలో బ్యాగ్ మాయం



బాధిత మహిళతో మాట్లాడుతున్న కానిస్టేబుల్

పొదిలిరూరల్: ప్రయాణికురాలి బ్యాగ్ మాయమైన సంఘటన శుక్రవారం పొదిలి ఆర్టీసీ డిపోలో చోటుచేసుకుంది. వివరాలు.. పొదిలికి చెందిన మూలె రమణమ్మ గత పదేళ్లుగా నరసరావుపేటలో నివాసం ఉంటోంది. బ్యాంకు లావాదేవీల నిమిత్తం శుక్రవారం పొదిలికి వచ్చి స్టేట్ బ్యాంకులో రూ.30 వేలు డ్రా చేసింది. తిరిగి నరసరావుపేట వెళ్లేందుకు డిపోకు వచ్చింది. బస్సు ఎక్కే హడావిడిలో బ్యాగ్ మరచిపోయింది. టికెట్ తీసుకోవడానికి డబ్బు కోసం చూడగా బ్యాగ్ లేదు. వెంటనే కంగారుగా కిందకు దిగి తాను కూర్చున్న ప్రదేశంలో వెతికింది. అప్పటికే బ్యాగ్ కనిపించలేదు. ఆర్టీసీ అధికారులకు విషయం చెప్పడంతో డిపో ఆవరణ మొత్తం వెతికారు. లాభం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందిచారు. పోలీసులు డిపోను పరిశీలించి విచారించారు. డిపోలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీ ఎలా జరిగిందో గర్తించడం కష్టంగా మారింది.

పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి



మద్దిశెట్టి రవీంద్రను సన్మానిస్తున్న యాడిక శ్రీనివాసరెడ్డి

తాళ్లూరు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృషి చేయాలని పార్టీ తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర కోరారు. తాళ్లూరు మండల సచివాలయాల కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి శుక్రవారం మద్దిశెట్టి రవీంద్రను కలిసి తనను పదవికి ఎంపిక చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచి కాశిరెడ్డి, గ్రామ కన్వీనర్ టి.వరి, వార్డు మెంబర్ తోట క్రిష్ణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు అభినందనీయం



సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ చైర్మన్

కొనకనమిట్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని పీఎంసీ చైర్మన్ కడెం అంజిబాబు యాదవ్ సొంత నిధులతో ఏర్పాటు చేయటం అభినందనీయమని హెచ్ఎం రామాంజనేయులు, జేవీవీ జిల్లా నాయకులు దాసరి గురుస్వామి పేర్కొన్నారు. విగ్రహావిష్కరణలో కమిటీ సభ్యులు పునుగోటి కొండారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, పగడాల తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీను, ఆంజనేయచౌదరి, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే భూముల రైతులతో సమావేశం

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం రెవెన్యూ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులతో తహసీల్దార్ రామ్మోహన్‌రావు శుక్రవారం నాగంబొట్లపాలెం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. తాము కోల్పోతున్న భూములు మార్కెట్లో మంచి ధర పలుకుతున్నాయని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిహారం ఇప్పించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ సుబ్బారావు, వీఆర్వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహా సభ రేపు



కరపత్రాలను విడుదల చేస్తున్న యాదవ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: మార్కాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం నిర్వహించనున్న జిల్లా యాదవుల బహిరంగ మహా సభకు తరలిరావాలని యాదవ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్ యాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. వెంకటరాజు యాదవ్, ఓ.వెంకటయ్య, మొర్రి పిచ్చయ్య యాదవ్, రమేష్ యాదవ్, కె.పోలయ్య యాదవ్, క్రిష్ణమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం

పట్టణంలోని కోదండరామస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు విశ్వబ్రాహ్మణుల సమావేశం నిర్వహిస్తామని సంఘ తాత్కాలిక అధ్యక్షుడు రంగాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం వారు పాల్గొనాలని కోరారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత



ఎమ్మెల్యే నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న వలంటీర్లు

మార్కాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని వలంటీర్లకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. పట్టణంలో నూతనంగా నియమితులైన 30 మంది వలంటీర్లకు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. చిత్తశుద్ధితో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు బాబి, ఉత్తమ్‌కుమార్, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకూడదు



ఉత్తమ అధికారులను సత్కరిస్తున్న ఎస్ఈ మర్దన్ అలీ

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ

పొదిలి రూరల్: రానున్న వేసవిలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌అలీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్‌డూబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల డీఈలు, జేఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఎస్ఈ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న నీటి లభ్యతను అంచనా వేసి, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. చేతి పంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, డీప్‌బోర్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పైపులైన్లు, ట్యాంకర్ ట్రిప్పుల ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన వైపాలెం డీఈ రామాకృష్ణారావు, బేస్తవారిపేట జేఈ రాయాంజనేయులును సత్కరించి అభినందించారు.

జగనన్న కాలనీల్లో గృహాలు పూర్తి కావాలి



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేక అధికారి ఉపేంద్రకుమార్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చందన

● మండల ప్రత్యేక అధికారి ఉపేంద్రకుమార్

తాళ్లూరు: జగనన్న కాలనీల్లో గృహాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెట్ ఫెడ్ డీడీ, మండల ప్రత్యేక అధికారి ఉపేంద్రకుమార్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహాలు పూర్తయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కేవై కీర్తి, హౌసింగ్ ఏఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

మార్కాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ చందన సూచించారు. శుక్రవారం నికరంపల్లిలోని జగనన్న లేఔట్‌లో హౌసింగ్ డే నిర్వహించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఉగాదికి అందరూ ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌బాబు, హౌసింగ్ ఏఈ చందు, ఉపాధి హామీ ఏపీఓ జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పరిపూర్ణ ఆరోగ్యం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న బాలాజీ నాయక్

బేస్తవారిపేట: అధిక ప్రోటీన్లతో ఉండే చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోనపల్లెలో చిరుధాన్యాలపై అవగాహన నిర్వహించారు. వీటిని ఆహారంగా తీసుకుంటే రక్తపోటు, కొవ్వును తగ్గిస్తుందని, మధుమేహం, స్థూలకాయం, ఆస్తమా, రొమ్ము క్యాన్సర్‌ల వంటివాటిని నివారిస్తాయన్నారు. జీవనశైలి సమస్యలు ఎదుర్కోవడంలో సహాయ పడతాయన్నారు. ప్రతి 100 గ్రాముల రాగుల్లో 344 మి.గ్రా క్యాల్షియం, సజ్జలో 16.9 మి.గ్రా ఐరన్, ఊదలో 15.2 మి.గ్రా ఐరన్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



దొనకొండ : అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దొనకొండ:గణతంత్ర దినోత్సవంలో గురువారం ఉత్తమ సేవలకు అవార్డులు పొందిన వారిని శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రవిచంద్రారెడ్డి, లైన్‌మెన్ టి.రాజ్‌కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు, ఎంపీడీవో వి.వసంతరావునాయక్, అధికారులు, సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యుడు సూరిబాబుకు సన్మానం

గిద్దలూరు రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గిద్దలూరు ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డా.సూరిబాబుకు ప్రభుత్వం ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందజేసిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఏరియా వైద్యశాల సిబ్బంది వైద్యశాల ఆవరణలో సన్మానం నిర్వహించారు. వైద్య సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.